క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఆవులవారిపాలెం(క్రోసూరు): మండలంలోని ఆవులవారిపాలెం గ్రామంలో విద్యుత్ స్తంభంకు ఉన్న ఎర్త్ వైర్ ద్వారా విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృత్యువాత పడిన ఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గోపు నాగేశ్వరరావుకు చెందిన పాడి గేదె మేతకు వెళ్తూ విద్యుత్ స్తంభంకు ఉన్న ఎర్త్ వైర్‌ను తాకింది. ఎర్త్ వైర్‌కు విద్యుత్ ప్రవహిస్తుండటంతో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె సుమారు రూ.1.20 లక్ష చేస్తుందని బాధితుడు వాపోయాడు. దీనిపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పొగాకుపై పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



క్రోసూరు: ఈ నెల 3వ తేదీన నిర్వహించిన పొగాకుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బుధవారం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి, కార్యక్రమ నిర్వాహకుడు శిఖామ్యాంసన్ బహుమతులు అందజేశారు. క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి కె.నేహ, ద్వితీయ బహుమతి ఇ.పవన్, తృతీయ పి.శైలజ గెలుచుకున్నారు. వీరికి పాఠశాల హెచ్‌ఎం దుగ్గి బాబూరావు సమక్షంలో శిఖామ్యాంసన్ బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను కార్యక్రమ నిర్వాహకుడు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.రామాజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంఈవో గుండెపోటుతో మృతి



బొద్దు రామారావు (ఫైల్)

సత్తెనపల్లి: రిటైర్డ్ ఎంఈవో, ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బొద్దు రామారావు (77) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. పట్టణ రఘురాంనగర్‌లోని ఆయన గృహంలో రామారావు తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య నాగేంద్రమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలయ్యాయి. బొద్దు రామారావు గతంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మరణవార్త తెలియడంతో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఆదెయ్య, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు బుధవారం రామారావు పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, అంకాల ప్రభుదాసు, పొత్తూరి రామకోటయ్య, శృంగారం, కమలాకర్, సుబ్బారావు, మల్లేశ్వరరావు, గద్దె మురహరిరావు, యెల్లినేడి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



నకరికల్లు: ఎరువులు కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై ఎఫ్‌సీఓ 1985 చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ఇన్‌వాయిస్‌లు, నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని కృత్రిమ కొరత సృష్టించిన వారి వివరాలు అందజేయాలని రైతులకు సూచించారు. రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలు ఏరోజుకారోజు నమోదు చేయాలని డీలర్లను ఆదేశించారు. రసీదులపై ధర, బ్యాచ్‌నంబర్, అమ్మకం, కొనుగోలుదారుల సంతకాలు ఉండాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని తెలిపారు. అన్నదాత సుఖీభవకు అర్హత ఉండి లబ్ధి చేకూరని రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ నెల 3వ తేదీ నుంచి గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులోకి వచ్చిందని ఏవో కె.దేవదాసు చెప్పారు. పీఎం కిసాన్ పథకానికి ఫార్మర్ ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని, ఎన్‌పీసీఐ ప్రక్రియ సరిచేసుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



మన్నెసుల్తాన్‌పాలెం వద్ద రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న నీరు



చల్లగుండ్ల సమీపంలో నీట మునిగిన పొలాలు



సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో నీటమునిగిన పత్తి పంట



నందిగామ లో లెవల్ చప్టా వద్ద తూడును తొలగిస్తున్న దృశ్యం

కుండపోతతో జన జీవనం అస్తవ్యస్తం

- రాజుపాలెంలో అత్యధికంగా 68.08 మి.మీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు
- పొంగి పొర్లిన వాగులు, వంకలు



సత్తెనపల్లిలో వర్షపు నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కమిషనర్ ఆనందకుమార్



బలుసుపాడు వద్ద నీట మునిగిన పంట పొలాలు, రోడ్డు



పాటిబండ్లలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



నీరుకుంటలో కొట్టుకుపోయిన యువకులను కాపాడిన పెదకూరపాడు పోలీసులు

సత్తెనపల్లి: ఎడతెరిపి లేకుండా వాన దంచి కొట్టింది. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. సత్తెనపల్లిలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయంగా మారాయి. వర్షపు నీరు సులువుగా వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ముఖ్యంగా వడ్డవల్లి, నాగన్నకుంట, దోబీఘాట్, వడ్డెరకాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు గృహాల్లోకి ప్రవేశించింది. నాగన్నకుంటలో మోకాళ్ళ లోతు నీళ్లు నిలబడ్డాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

■ సత్తెనపల్లిలో ఎటు చూసినా వర్షపు నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలోని 7వ వార్డులో బైసాని మల్లేశ్వరరావుకు చెందిన పాత డాబా ఒక గది పైకప్పు కుప్ప కూలింది. అయితే ప్రాణ నష్టం జరగలేదు. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. సత్తెనపల్లి–అచ్చంపేట మార్గంలో చింత చెట్లు కూలిపోవడంతో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి నేతృత్వంలో పోలీసులు, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులు వాటిని తొలగించారు. నాగన్నకుంట వెనుక బజారులో రహదారి కోతకు గురి కావడంతో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది.

■ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, చెట్లు విరిగి పడిన ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనందకుమార్, తహసీల్దార్ చక్రవర్తి, ఆయా శాఖల అధికారులతో వేర్వేరుగా పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. సత్తెనపల్లి–అమరావతి మార్గంలోని నందిగామ లో లెవల్ చప్టా వద్ద తూడు పెరిగి వర్షపు నీరు రోడ్డుపైకి చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై రాకపోకలను నిలిపివేసి పొక్లెయిన్‌తో తూడును తొలగింపజేశారు. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. పత్తి పంట పూర్తిగా నీట మునిగింది. నియోజకవర్గంలో రాజుపాలెం మండలంలో అత్యధికంగా 68.08 మి.మీ, అత్యల్పంగా నకరికల్లు మండలంలో 38.0 మి.మీ వర్షపాతం నమోదైంది. సత్తెనపల్లిలో 64.8 మి.మీ, ముప్పాళ్ళలో 52.2 మి.మీ నమోదైంది. రాజుపాలెం మండలంలో పలుచోట్ల వాగులు, వంకలు పొంగడంతో రోడ్డుపై ఉధృతంగా వర్షపునీరు ప్రవహించింది. గణపవరం, బలిజేపల్లి ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.



కంభంపాడు వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ముప్పాళ్ళ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోళ్ళపాడులోని ఎస్టీ కాలనీ, సమీపంలోని కేజీబీవీ పాఠశాలలోకి వర్షపు నీరు చేరింది. ముప్పాళ్ళలో రహదారి వెంబడి డ్రైనేజీలు సరిగ్గా లేకపోవటంతో నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై గోళ్లపాడు వాగు చప్టా మీదుగా ప్రవహిస్తుంది. లో లెవల్ చప్టా కావటం, నీటి ఉధృతి అంతగా లేకపోవటంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. సత్తెనపల్లి–పిడుగురాళ్ల రహదారిపై రాకపోకలు నిలిచిపోవటంతో వాహనాలన్నీ ముప్పాళ్ళ మీదుగా నరసరావుపేట వైపుగా పిడుగురాళ్లకు మళ్లించారు. వర్షాలకు గ్రామాల్లోని అంతర్గత రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పత్తి పొలాల్లో, వరి నారుమడుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

నకరికల్లులో...

నకరికల్లు: మండలంలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలన్నీ జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో వాగులు, చెరువులు నిండుకుండల్లా తలపిస్తున్నాయి. వర్షం ధాటికి చల్లగుండ్ల–చీమలమర్రి గ్రామాల మధ్య రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పొలాల్లో వర్షపునీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. ఇప్పటికే వరి నారుమళ్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. బోర్లు, బావుల ఆధారంగా ముందస్తు వరినాట్లు వేసిన పొలాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరడంతో పంట పాడవుతుందని రైతులు కలవరపడుతున్నారు.



సత్తెనపల్లి–అచ్చంపేట రోడ్డులో కూలిన చెట్లను తొలగింపజేస్తున్న తహసీల్దార్ చక్రవర్తి, అధికారులు

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. బుధవారం కూడా రోజంతా భారీ వర్షం పడడంతో చెరువులు, కుంటలు నిండిపోయి, పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పత్తి, వరి పంటలు నీట మునిగాయి. నాగిరెడ్డిపాలెంలో చెరువులోకి భారీగా నీరు చేరి, పొంగి ఎస్ఎస్‌పీ కాలువలోకి ప్రవహిస్తుంది. కల్వర్టు మీదుగా నీరు భారీగా రావడంతో బెల్లంకొండ–నందిరాజుపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మన్నెసుల్తాన్‌పాలెం కాలువ వద్ద వర్షపు నీరు తీవ్రస్థాయిలో రావడంతో దాదాపు 5 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. నాగిరెడ్డిపాలెం వద్ద వరి పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. మండలంలో పొంగుతున్న పలు కాల్వలను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్ష బీభత్సం....రాకపోకలకు అంతరాయం

- పొంగిపొర్లిన వాగులు, నీట మునిగిన పొలాలు
- వాగుల వద్ద రెవెన్యూ, పోలీసులు బందోబస్త్
- ఇద్దరు యువకులను కాపాడిన పెదకూరపాడు పోలీసులు



పెదకూరపాడులో పొలంలో నీరును బయటకు పంపుతున్న రైతులు



పాటిబండ్ల వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ ధనలక్ష్మి

పెదకూరపాడు: పెదకూరపాడులో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట పొలాల్లో వర్షపు నీరు పారి పత్తి పంట నేల కొరిగింది. పెదకూరపాడులో పేరమ్మ వాగు పొంగి పొర్లింది. దీంతో సత్తెనపల్లి–అమరావతి కాలచక్ర రోడ్డుపై వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. బలుసుపాడు వద్ద పంట పొలాలు నీట మునిగాయి. అబ్బరాజుపాలెం–జలాల్‌పురం, పరస–కంభంపాడు వద్ద చప్టాలపై నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. పాటిబండ్ల వాగు ఉధృతికి పక్కన ఉన్న పంట పొలాలు మీదగా నీరు పారింది. దీంతో పత్తి పంట నేల కొరిగింది. పాటిబండ్ల–పెదకూరపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జన జీవనం స్తంభించింది. పాటిబండ్ల గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. లింగంగుంట్ల–పోబపాడు మధ్య వాగులు ఉధృతంగా ప్రవాహించాయి. కంభంపాడు వాగు ఉధృతంగా ప్రవాహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెదకూరపాడులో బుధవారం తెల్లవారుజామున నీరు కుంట ఉధృతంగా ఉండటంతో ఇద్దరు యువకులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారిని పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తన సిబ్బందితో కలిసి కాపాడారు. పొంగిపొర్లుతున్న వాగులను రెవెన్యూ సిబ్బందితో కలసి సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి పరిశీలించారు. వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలిపారు.

ఇళ్లలోకి చేరిన వరద నీరు



వరద ప్రవాహం పరిశీలించిన తహసీల్దార్ నాగరాజు, ఎస్ఐ రవిబాబు



గరికపాడు వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు



ఉయ్యందన లో లెవల్ చప్టా వద్ద..

క్రోసూరు: మండలంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రహిస్తుండటంతో రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తం అయి వాగుల వద్ద రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని అందుకూరు, ఉయ్యందన గ్రామాల వద్ద లో లెవల్ చప్టాలపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

దొడ్లేరును చుట్టుముట్టిన వరద నీరు

మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి, ఎగువన కురిసిన అతి భారీ వర్షాలతో కలిసి వరద నీరు పొంగి ప్రవహించి బుధవారం మండలంలోని దొడ్లేరు గ్రామాన్ని చుట్టుముట్టింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలో పిడుగురాళ్ల రోడ్డు వైపు గల లో లెవల్ చప్టాపై నీరు పొంగి ప్రవహించటంతో గ్రామ సచివాలయం, కొన్ని ఇళ్లలోకి నీళ్లు చేరాయి. గ్రామంలోని హసనాబాద్ రోడ్డులో లో లెవల్ చప్టా మీదగా వరద నీరు పొంగి ప్రవహించింది. గ్రామంలోని పెరికపాడు రోడ్డులో రెండు చెరువులు నిండిపోయి ముస్లిం బజారులోని ఇళ్లలోకి నీళ్లు చేరాయి. చెరువుకు గండి పెట్టకుంటే మరింత ప్రమాదం ఉందని ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వటంతో తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఎస్ఐ పి.రవిబాబు, రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని గమనించి చెరువుకు గండి కొట్టి నీళ్లు బయటకు పంపారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలోని వీధుల్లో నీళ్లు నిలబడి ప్రజలకు బయటకు రాలేకపోయారు. పిడుగురాళ్ల నుంచి క్రోసూరు వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనాలు, హసనాబాద్, పెరికపాడు నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పంట పొలాలు నీట మునిగాయి.



దొడ్లేరులో చెరువుకు గండి కొడుతున్న దృశ్యం

జలదిగ్బంధంలో అచ్చంపేట

అచ్చంపేట: మండలంలో కురిసిన భారీ వర్షానికి అచ్చంపేట జలదిగ్బంధంలో కూరుకుపోయింది. మాదిపాడు వైపు రోడ్డుపై మోకాళ్ల లోతులో నీళ్లు ప్రవహించాయి. అమరావతి రోడ్డులోని చిగురుపాడు వద్ద వాగుపై నడుము లోతు వరకు నీళ్లు ప్రవహించడంతో ఉదయం 5 గంటల నుంచి 9 వరకు రాకపోకలు స్తంభించాయి. సత్తెనపల్లి వైపు వాగు పొంగి పొర్లడంతో సత్తెనపల్లి నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలను ఉదయం 12 గంటల వరకు నిలిచిపోయాయి. అచ్చంపేట చుట్టూ ఎటుచూసినా వరద నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. బస్సులు ఎక్కడివక్కడ నిలచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల వరకు వాగులపై నుంచి ద్విచక్ర వాహనాలను అచ్చంపేట పోలీసులు అనుమతించలేదు.



మాదిపాడు వైపు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

జల దిగ్బంధంలో అమరావతి మండలం




ఎండ్రాయి వద్ద గుంటూరు-అమరావతి రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

అమరావతి: మండలంలోని గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఎగువ నుండి వచ్చిన వరద నీటితో వాగులు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. నియోజకవర్గంలోని పెదకూరపాడు మండలంలో 16.5 సెం.మీ, అమరావతి 8, క్రోసూరు 9, అచ్చంపేట 13, బెల్లంకొండ మండలంలో 9.6 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది. అమరావతి–విజయవాడ రోడ్డులో పెదమద్దూరు వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండటంతో పెదమద్దూరు గ్రామంలోకి వరదనీరు ప్రవేశించింది. అలాగే అమరావతి–గుంటూరు రోడ్డులో నరుకుళ్ళపాడు, ఎండ్రాయి వద్ద రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. అలాగే క్రోసూరు రోడ్డులో ముత్తాయిపాలెం వద్ద నక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. సత్తెనపల్లి రోడ్డులో పరస వద్ద వాగు ఉధృతికి అమరావతి–సత్తెనపల్లి రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. మేళ్ళ వాగు, కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించటంతో పరివాహక ప్రాంతాలలో ఉన్న పంట పొలాల్లో నీరు నిల్చిపోయింది. సుమారు 2 వేల ఎకరాలలో పత్తి పంట నీట మునిగిందని అధికాకారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు అప్రమత్తమై పెదమద్దూరు చప్టా వద్ద రాకపోకలను నియత్రించేందుకు సిబ్బందిని నియమించారు. పెదమద్దూరు వాగు ఉధృతి పెరిగి నూతనంగా నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జికి సమానంగా వరదనీరు ప్రవహించటంతో చుట్టుపక్కల సుమారు కిలోమీరు మేర ఎటు చూసినా వరదనీరు ముంచెత్తింది. పల్లపు ప్రాంతాలలో నీట మునిగిన పత్తి చేలపై ఆశవదులు కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నీట మునిగిన పత్తి చేలు



పెదమద్దూరును చుట్టుముట్టిన వరద నీరు